# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

- జూబ్లీహిల్స్‌లో 3,85,265 మంది ఓటర్లు.. 335 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు
- ఎన్నికల విధుల్లో 2000 మందికిపైగా అధికారులు
- సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లపై నిఘా..
- జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి



జూబ్లీహిల్స్, నవంబర్ 28 : ఎన్నికల యుద్ధానికి అధికారులు సిద్ధమవుతున్నారు. రేపు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,85,265 మంది ఓటర్లున్నారు. గతంలో 3,56,995 మంది ఓటర్లకు 329 పోలింగ్ బూత్‌లుండగా.. ఇటీవల 28,270 మంది కొత్త ఓటర్లు పెరగడంతో 1600 మంది కంటే ఎక్కువ ఓటర్లున్న బూత్‌లలో మరో 6 ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దీంతో ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 335 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సా మగ్రిని తరలించి.. తిరిగి వాటిని తీసుకునేందుకు యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 'డిస్ట్రిబ్యూషన్-రిసీవింగ్-సెంటర్' (డీఆర్‌సీ)ను ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, ఓట్ల లెక్కింపుకు ఇండోర్ స్టేడియంలో హాల్‌లో కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుమారు 2000 మందికి పైగా అధికారులు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు కార్యోన్ముఖులు కానున్నారు.

***అధికారుల నియామకం పూర్తి ..***

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం పూర్తిచేసినట్లు సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి తెలిపారు. జూబ్లీహిల్స్‌కు ఒక ఎలక్టోరల్ ఆఫీసర్, నలుగురు ఏఈఆర్‌ఓల తో పాటు 47 మంది మైక్రో అబ్జర్వర్లు, 32 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. దీంతో పాటు ప్రతి పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ), ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఓపీఓ)తో పాటు మరొక ఇద్దరు అదర్ పోలింగ్ అధికారులు (ఓపీఓ), ఒక పోలీస్ అధికారిని (ఏఎస్ఐ/హెచ్‌సీ) నియామకం చేసినట్లు తెలిపారు.

***151 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు..***

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 335 పోలింగ్ స్టేషన్లలో 151 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను అధికారులు గుర్తించా రు. పోలింగ్ స్టేషన్‌లలోని 52 లొకేషన్స్‌లలో ఉన్న ఆయా క్రిటికల్ పోలింగ్ బూత్‌లలో నలుగురు చొప్పున పోలీస్ అధికారులను, సిబ్బందిని నియమించినట్లు ఆర్వో రవి తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పర్యవేక్షించేందుకు 47 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటు నియోజకవర్గంలోని 32 రూట్లలో నిరంతర నిఘా పెంచేందుకు 32 మంది సెక్టోరియల్ ఆఫీసర్‌లను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు సమర్థవంతంగా.. సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## 853 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు

జూబ్లీహిల్స్,నవంబర్28 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 853 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి తెలిపారు. గత నాలుగురోజులుగా చేపడుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఇందులో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అదర్ పోలింగ్ ఆఫీసర్స్ ఓట్లు 486 పోలయ్యాయి. పోలీస్ ఉద్యోగులకు సంబంధించిన ఓట్లు 266.. సీనియర్ సిటిజన్, పర్సన్ విత్ డిజేబుల్ విభాగంలో 101 ఓట్లు పోలయ్యాయి. షేక్‌పేట్ నారాయణమ్మ కాలేజీలో, బంజారాహిల్స్‌లో ఉన్న షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీస్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించినట్లు ఆర్వో రవి తెలిపారు. ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎలక్షన్ సెక్టోరియల్ ఆఫీసర్స్‌తో జూబ్లీహిల్స్ ఎన్నికల పరిశీలకుడు జె.జయకాంతన్ సమావేశమై ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్, ఆర్వో రవి, ఈఆర్వో సేవా ఎస్లావత్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

వెంగళరావునగర్, నవంబర్ 28 : అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి.. వారి నుంచి 141 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఉదయ్ తెలిపిన వివరాల ప్రకారం..రహ్మత్ నగర్ మెయిన్ రోడ్డు వద్ద రవికిరణ్, నగేశ్‌లు బైక్‌పై అక్రమ మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 141 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.





ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, నేతలు

# కారు గుర్తుకు ఓటేసి గెలిపించండి..

## ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన.. ర్యాలీలు

జూబ్లీహిల్స్,నవంబర్28: ఓటరు మహాశయులు తమ ప్రాంత ప్రగతి ప్రాతిపదికగా ఓటు వేయాలని జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా గత రెండు పర్యాయాలు శాసనసభ్యునిగా అవిరళ కృషి చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ఒక గాడిన పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థిత్వంతో పాటు జూబ్లీహిల్స్‌లో కారు గుర్తుకు ఓటువేసి అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రతి ఓటరు కృషి చేయాలన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాగంటి కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య రావు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

***మాగంటికి బ్రహ్మరథం..***

అసెంబ్లీ ఎన్నికల్లో చివరిరోజు ప్రచారానికి సుడిగాలి పర్యటన చేపట్టిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రభుత్వం అందజేసిన వేలాది సంక్షేమ పథకాలతో పాటు ప్రతి లబ్ధిదారుకు ఒక బహుమతి ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్న ఎమ్మెల్యే మాగంటికి ప్రతి ఇంటితో అవినాభావ సంబంధం ఉంది. దీంతో ప్రతి ఇంటిలో తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రెండు, మూడు సంక్షేమ పథకాలతో పాటు ప్రతి ఇంటిలో రెండుమూడు బహుమతు లు ఉంటాయి. ఈ నేపథ్యంలో మాగంటి ప్రతి ఇంటి ఆపన్న హస్తంగా ఉండిపోతున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన చివరి ఎన్నికల ప్రచారాన్ని ప్రజలు మంగళహారతులతో ఆద్యంతం జయప్రదంగా నిర్వహించారు.



ఓపెన్‌టాప్ జీపుపై ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

***మాగంటికి మద్దతుగా ఇంటింటి ప్రచారం..***

ఎర్రగడ్డ, నవంబర్ 28: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అదే విధంగా తక్కువ వ్యవధిలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమైన అంశాలను ప్రజల ముం దుంచారు. వెళ్లిన ప్రతి చోట స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. బోరబండ డివిజన్ మధురానగర్‌లో బస్తీ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో యూనుస్, హాజి, యూసుఫ్, జావిద్, బద్రుద్దీన్, షబ్బీర్, దేవేందర్, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, నసీరుద్దీన్, ముజాహిద్, సందీప్, రామస్వామి, ఒమర్, అభిషేక్, ఆసిఫ్ పాల్గొన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్ శాస్త్రినగర్‌లో పార్టీ నాయకురాలు జ్యోతిబాయి ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో రవికుమార్, సక్కుబాయి, మంగ, సావిత్రి, హరికృష్ణ, ఆండాలు, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

***మాగంటిని గెలిపించాలి..***

వెంగళరావునగర్, నవంబర్ 28 :జూబ్లీహిల్స్ నియోజకవరంలో అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించాలని వెంగళరావునగర్ బీఆర్ఎస్ నాయకుడు బిట్ల సుశీల్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వెంగళరావునగర్ కాలనీలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, మంచి చేస్తున్న ప్రభుత్వా నికి ప్రజలు పట్టం కట్టాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు భద్రత,భరోసా ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అర్జున్, జయ, అనిత, ప్రవీణ పాల్గొన్నారు.



బోరబండ డివిజన్, మధురానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్, తదితరులు



ఎర్రగడ్డ డివిజన్, ఓల్డ్ శాస్త్రినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జ్యోతిబాయి, బీఆర్ఎస్ నేతలు



వెంగళరావునగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు సుశీల్ కుమార్